# 911

అమెరికాలో ఏ రాష్ట్రంలోనైనా, ఏ ఊళ్ళోనైనా ప్రజలకి అత్యవసరమైన సహాయం కావాలంటే చేయవలసిన ఫోన్ నెంబర్ 911. ఫోన్ చేయగానే వెంటనే ఆ సహాయం ఫోన్‌లోనే మొదలవుతుంది. అంబులెన్స్‌తోపాటూ వచ్చే పారామెడిక్స్ ముందు ఇంట్లోనే ప్రథమ చికిత్స మొదలుపెడతారు. తర్వాత అంబులెన్స్‌లో సహాయం చేస్తారు. హాస్పిటల్‌కి వచ్చే లోపల ఫోన్‌లో వివరాలు అప్పటికప్పుడే చెబుతుంటారు కనక అంబులెన్స్ వచ్చేసరికీ అక్కడ వైద్య సిబ్బంది అనుకున్న ప్లాన్ ప్రకారం అక్కడ సిద్ధంగా వుంటారు ఎవర్నీ అంత సులభంగా చావనియ్యరు. అదే వాళ్ళలక్ష్యం. 911 పిలిచిన తర్వాత ఎక్కడో మారుమూల ప్రదేశంలోతప్ప సాధారణంగా పదిహేను నిమిషాల్లో అంబులెన్స్ ఇంటి ముందర వుంటుంది. ఒకవేళ దూరంలోవున్నా, మరీ అత్యవసరమైనా హెలికాప్టర్‌లో తీసుకు వెళ్ళి సహాయం అందివ్వటం కూడా రోజువారీ చూస్తూనే వుంటాం.

ఇవన్నీ చూస్తుంటే యుద్ధ సన్నాహాలు గుర్తుకు వస్తాయి. ఇండియాలోని అమెరికన్ టీవీ ఛానెల్స్‌లో వస్తుందో లేదో నాకు తెలీదు కానీ, ఇ.ఆర్. (ఎమర్జెన్సీ రూమ్) అని షో వుంది. అది చూస్తుంటే ఆ హడావిడి ఏమిటో తెలుస్తుంది. అలాగే 911 అనే ఇంకొక టీవీ షోలో నిజంగా ఆ 911 పిలుపు అందినప్పటినించీ, పూర్తయే దాకా విడియో తీసి చూపిస్తుంటారు. కొన్ని సంఘటనలు అలా నిజంగా జరుగుతున్నప్పుడే చూపిస్తుంటే, ఇంట్లో సుఖంగా సోఫాలో కూర్చుని చూసే మనకే ఆందోళనగా వుంటుంది. మరి ఆ అనుభవించే వాళ్ళకెలావుంటుందో ఊహించుకోవాలి. ఈ 911 టెలిఫోన్ ఆపరేటర్లు, అంబులెన్స్‌లో పారామెడిక్స్, ఎమర్జెన్సీ గది స్టాఫ్... రోజు రోజుకీ, గంట గంటకీ అలా సాటి మానవ ప్రాణాలు కాపాడటానికి, సర్వశక్తులా ప్రయత్నం చేస్తుంటే, ఆ మానవత్వపు విలువలు చూసి ఒళ్ళు పులకరిస్తుంది. అదేదో ఉద్యోగంలా చేసే వాళ్ళు కాదు వాళ్ళు. అదే జీతానికి అంతకన్నా ఎంతో తక్కువ స్ట్రెస్ వున్న ఉద్యోగాలు దొరుకుతాయి. కానీ ఏరి కోరి ఇలాటి ఉద్యోగాల్లో చేరి, అటు ఉద్యోగ ధర్మం, ఇటు మానవ ధర్మం రెండూ నిర్వహించటం సామాన్యం కాదు.

ఇక్కడ చెప్పదగ్గ విశేషం ఒకటి నేను టీవీలో చూసింది. ఒక ముసలమ్మ, ఆరేళ్ళ మనవడూ ఇంట్లో వున్నారు. హఠాత్తుగా ముసలమ్మగారు కింద పడిపోయారు మాటా పలుకూ లేదు. మనవడు టీవీలో చూసినవీ, స్కూల్లో చెప్పినవీ గుర్తు పెట్టుకుని 911 నెంబర్‌కి ఫోన్ చేశాడు. అన్నీ వివరంగా చెప్పాడు. వాళ్ళు ఆ చిన్న పిల్లవాడికి అర్థమయేటట్టు సూచనలూ, సలహాలూ ఇస్తూ అతని చేత ఆవిడకి అవసరమైన ప్రథమ చికిత్సలు చేయించారు. అవి జరుగుతుండగానే హడావిడిగా అంబులెన్స్ వచ్చింది. ఈలోగా అబ్బాయి తన తల్లిదండ్రులకి కూడా ఫోన్ చేయటంతో వాళ్ళూ వచ్చారు వెంటనే ఆవిడని అంబులెన్స్‌లో హాస్పిటల్‌కి తీసుకువెళ్ళి ప్రాణం పోశారు. తర్వాత పది రోజుల్లోనే ఆవిడ 90వ జన్మదిన సందర్భం. కేక్

కోసే సమయానికి ఆ రోజు సహాయంచేసిన పారామెడిక్‌ని పిలిచారు. అతన్ని ఆ ముసలావిడకి పరిచయం చేశారు. ఆవిడ అతన్ని కౌగిలించుకుని ఆనందభాష్పాలు రాల్చింది. అతన్ని ముద్దు పెట్టుకుంది అతను నా ఉద్యోగధర్మం నేను చేశాను. మీ ప్రాణాల్ని రక్షించింది నేనుకాదు మీ మనవడు. అతనారోజు ఆలస్యంగా ఫోన్ చేసినా మమ్మల్ని పిలవకపోయినా ఈరోజు మిమ్మల్నిలా చూసేవాళ్ళం కాదు అని, వాళ్ళ డిపార్ట్‌మెంట్ తరఫున ఆ కుర్రాడికి ఒక సర్టిఫికేట్ ఒక మెడల్ అందించాడు.

సత్తెన్నారాయణకి టెన్నిస్ ఆడటం మహాసరదా. ఎంత సరదా అంటే తన ఐదు పదుల వయసుని మరచిపోయి తనకన్నా ఎంతో చిన్నవాళ్ళతో సమానంగా ఎన్నోగంటలు హుటాహుటిన ఆడేస్తాడు. ఒకరోజు ప్రొద్దున్నే ఎనిమిది గంటలకి మొదలు పెట్టి, మధ్యాహ్నం ఒంటిగంటదాకా ఎండలో టెన్నిస్ ఆడాడు. అర్ధరాత్రి వేళ బాత్రూమ్‌కి వెళ్ళి, వస్తూ బాత్‌రూమ్ దగ్గరే దబాల్న పడిపోయాడు. పడేటప్పుడు అక్కడ సింక్‌కి తల కొట్టుకుని స్పృహతప్పి పడిపోయాడు. ఆ శబ్దానికి చటుక్కున లేచింది అతని భార్య సావిత్రి. దగ్గరికి వెళ్ళి పలకరిస్తే మాటా పలుకూ లేవు. తల మీదనించి రక్తం కూడా కారుతున్నది.

పక్కగదిలో నిద్రపోతున్న పదహారేళ్ళ కూతురు సునందని నందూ' అని కేకేసింది. చటుక్కున లేచి వచ్చిన సునందకి, అక్కడ సతీ సావిత్రి ఒడిలో తలపెట్టుకుని పడుకున్న సత్యవంతుడు కనపడ్డాడు. సావిత్రి హడావిడిగా "నందూ ధర్మరాజు అంకుల్‌ని అర్జంటుగా పిలు. నాన్న పడిపోయారు" అంది.

ధర్మరాజు అంకుల్ అంటే సత్తెన్నారాయణకి ముఖ్య స్నేహితుడు ఎమ్. ధర్మరాజు. ఒక్కక్షణంలో పరిస్థితిని అర్ధం చేసుకుని, తక్షణ కర్తవ్యం అంకుల్ కాదనుకుని, అంకెల్ని గుర్తుకు తెచ్చుకుని 911కి ఫోన్ చేసింది.

ఆపరేటర్ అడ్రస్సూ తదితర వివరాలు అడుగుతూనే అంబులెన్స్‌ని డిస్పాచ్ చేసింది. ఈలోగా ఫోన్లో వివరాలు అడుగుతూనే, రకరకాల ప్రథమ చికిత్సలు చెప్పింది. తల కొంచెం పైకెత్తి ఒడిలో పెట్టుకోమంది. స్పృహ, నాడి చూడమంది. నిమిషానికి గుండె ఎన్నిసార్లు కొట్టుకుంటుందో చెప్పమని, అదిఎలా లెఖ్ఖపెట్టాలో చెప్పింది. గాలి బాగా ఆడేటట్టు చూడమంది. ఇలా చెప్పటంవల్ల, ఆమె రోగి ప్రమాదావస్థ గురించి తెలుసుకోవటమేకాక, పక్కన వున్న వాళ్ళు గాబరా పడకుండా వాళ్ళని బిజీగా వుంచటం కూడా అవసరం మరి.

ఆరు నిమిషాల్లో అంబులెన్స్ ఇంటిముందర ఆగింది. ఇద్దరు పారామెడిక్స్ దిగి లోపలికి వచ్చారు. ఒకతను సత్తెన్నారాయణని ఆ మత్తులోనించి బయటికి తెప్పించటానికి ప్రయత్నాలు చేస్తున్నాడు. రెండో అతను బ్లడ్ ప్రెషర్ చూస్తూనే, తలకి తగిలిన గాయాన్ని ఎంత లోతుగా చిట్లిందో పరీక్షిస్తున్నాడు. పరీక్షిస్తూనే సావిత్రిని అడుగుతున్నాడు, అతను ఎందుకు పడిపోయాడో తెలుసుకుందామని సావిత్రి చెప్పింది. అతను నవ్వి అన్నాడు, బహుశా డీహైడ్రేషన్ అయిందేమో అని.

పారామెడిక్ సత్తెన్నారాయణ బుగ్గ మీద చేత్తో తడుతూ "డు యు నో యువర్ నేమ్ సార్... కెన్ యు టెల్ మి యువర్ నేమ్." అని అడుగుతున్నాడు.

సత్తెన్నారాయణలో కొంచెం మెలుకువ కదలిక వచ్చాయి. ఏదో తెలుగులో గొణుగుతున్నాడు. పారామెడిక్‌కి ఏమీ అర్ధంకాక చూస్తుంటే, సునంద అంది "దె ఆర్ ఆస్కింగ్ యువర్ నేమ్ నాన్నా"అని. ఇంకా ఏదో అంటున్నాడు తెలుగు వాళ్ళకే అర్ధంకాని అచ్చ తెలుగులో సత్తెన్నారాయణ.

"డ్రిప్ పెట్టటం అవసరం. హాస్పిటల్‌కి వెడదాం. మేం ఈయన్ని తీసుకువెడతాం. మీరు వెనక రండి" అని చెప్పి స్ట్రెచ్చర్‌మీద అతన్ని తీసుకుని అంబులెన్స్ మీద ఎఱ్ఱ, నీలం రంగు లైట్లు వెలిగించుకుని సైరన్ మోగిస్తూ హాస్పిటల్‌కేసి వెళ్ళిపోయారు. సావిత్రి సునంద అక్కడికి వెళ్ళేసరికే, అతని తలకి స్కానింగ్ చేసి, మంచంమీద పడుకోబెట్టి చేతికి డ్రిప్ కూడా పెట్టారు. అప్పుడప్పుడూ కళ్ళు తెరిచి ఏదో అంటున్నాడు కానీ, అతని మాట స్పష్టంగా లేదు .

డాక్టర్ వచ్చి అంతా సవ్యంగానేవుందనీ డీహైడ్రేషన్‌వల్లే అలా అయిందనీ, బాగా నీళ్ళూ, ఎలక్ట్రోలైట్లూ తాగాలనీ చెప్పాడు. ప్రొద్దున ఆరింటికి అతన్ని డిస్చార్జ్ చేశారు. అతన్నికారు ఎక్కిస్తున్నప్పుడు అతనికి తెలివి వచ్చింది.

"ఎక్కడ వున్నాం?" అన్నాడు ఇంగ్లీష్‌లో.

సునంద నవ్వి, "టెన్నిస్ కోర్ట్‌లో. ఇప్పుడే గేమ్ అయిపోయింది డాడీ!" అంది.

"అప్పుడే అయిపోయిందా" అని ఈసారికూడా ఇంగ్లీషులోనే అని, మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు సత్తెన్నారాయణ.

"లేదు. ఇంకో నాలుగు ఆటలు ఆడండి. మళ్ళీ ఇక్కడికి రావచ్చు" అంది సతీ సావిత్రి, తను కూడా నవ్వుతూ నాలుగూ పెట్టి.

తర్వాత ఆరు నెలలకి సత్తెన్నారాయణ వాళ్ళ ఏరియాలో ఒక బ్లాక్ పార్టీ అయింది. మామూలుగా పిల్లలకి తెలియటం కోసం, ఫైర్ సర్వీస్ వాళ్ళూ పోలీస్ డిపార్ట్‌మెంట్‌వాళ్ళు, ఎమర్జెన్సీ స్టాఫ్ అందరూ వస్తారు. వచ్చి ఏ అవసరానికి ఎవర్నిఎలా పిలవాలో పిలిస్తే వాళ్ళువచ్చి ఏమేం చేస్తారో, ఎలా చేస్తారో వివరంగా చెబుతారు. పిల్లల్ని ఫైర్ ఇంజన్ ఎక్కించి అన్నీ చూపిస్తారు. అప్పుడే సావిత్రి అతన్ని గుర్తుపట్టి, సత్యవంతుడి చేయి పట్టుకుని అతని దగ్గరికి తీసుకువెళ్ళింది.

అతనితో "మా ఆయన ఇదుగో. ఆ రోజు.. " అంటుండగానే అతను నవ్వి "అవును. నాకింకా గుర్తుంది మీ ఇండియన్ భాషలో ఏవేవో చెప్పాడు కూడాను" అన్నాడు.

సత్తెన్నారాయణ అతనికి షేక్ హాండ్ ఇచ్చి "థేంక్స్ ఫర్ సేవింగ్ మై లైఫ్ ఆన్ దట్ డే" అన్నాడు.

అతను మళ్ళీ నవ్వి "నా డ్యూటీ నేను చేశాను. దాందేముంది. మీరు వెంటనే కోలుకున్నందుకు నాకు చాల సంతోషంగా వుంది" అన్నాడు.

* * *